
# అలసిన కళ్ళు

**కె.బి.కృష్ణ**

**ఆ** గది నిండా కార్పెట్ ఉంది. గది మధ్యలో బ్రౌన్ గ్లాస్ ఉన్న టీపాయ్, టీ పాయ్ చుట్టూ ముఖమల్ సోఫాలు. ఒక ప్రక్కన బెడ్, గోడలకు అందమైన వాల్‌పోస్టర్స్.

టీపాయ్ మీద ఫ్రైడ్ కాజూ, ఫ్రైడ్ చికెన్. ఫారిన్ లిక్కర్ బాటిల్, గ్లాసెస్, ఐస్ బాక్స్ ఉన్నాయి.

"బాజీగరో బాజీగర్" ఫిలిప్స్ పవర్‌హౌస్ టు ఇన్ వన్‌లో హై సౌండ్‌లో పాట వస్తుంది. ఆ పాటకు అనుగుణంగా జీవన్ డ్యాన్స్ చేస్తున్నాడు.



'జీవన్' ఆ నగరంలో షుగర్ ఫ్యాక్టరీ అధినేత జయంతి కృష్ణగారి ఏకైక పుత్రుడు.

కాలేజీలో సరదాగా. ఐదో సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు.

చదువుకోడం కొందరికి అధోక యజ్ఞం లాంటిది. లేదా ఎంతోకష్టపడి చదవడం లాంటిది. అయితే జీవన్‌కి టైమ్‌పాస్ కోసం హాబీ లాంటిది.

లైట్‌గా నిషా ఎక్కుతూంది. బాజీగర్‌లో షారూఖ్ ఖాన్ గుర్తుకు వచ్చాడు. వళ్ళు తెలియక హీరోలాగా ఎగురుతూ డ్యాన్స్ చేస్తున్నాడు.

ఈ లోగా...

జయంతి కృష్ణగారు ఆ గదిలోకి వచ్చారు.

"మైడియర్ బాయ్. డోన్ట్ ఎక్సీడ్ లిమిట్స్. మళ్ళీ రేపు కాలేజీకి వెళ్ళాలి కదా. ఎంజాయ్ ది లైఫ్' అంటూ కొడుకు భుజం తడుతున్నాడు.

జీవన్‌కి మంచి ఛాన్స్ దొరికింది.

సోఫాలో కూర్చున్న డాడీ దగ్గర, ఆ సోఫాలో స్థలం లేకపోయినా దగ్గరగా కూర్చుని...

"నేను ఒకటి అడిగాను గుర్తుందా?"

"ఏమిటీ... నీకు కాకపోతే ఈ సంపద అంతా ఎవరికోసం చెప్పు బాయ్..."

"నేను సరదాగా తిరగడానికి 'టాటా ఎస్టేట్' కారు కొనమని చెప్పాను. మీరు కొనలేదు.

అతని మాటలు పూర్తి కాలేదు.

"మైడియర్ బాయ్. అది చెప్పడానికే వచ్చాను. ఐస్‌క్రీమ్ కలర్ 'టాటా ఎస్టేట్' ఈజ్ వెయిటింగ్ ఫర్ యూ యట్ అవర్ డోర్‌స్టెప్స్."

ఆయన మాటలు వింటూనే...

"ఓ డాడీ... థ్యాంక్యూ"

ఆయన్ను కౌగలించుకుని, ముద్దులు పెట్టుకుని అలాగే ఉండిపోయాడు జీవన్.

మరో గదిలో

గదినిండా కార్పెట్. పెర్‌ఫ్యూమ్ వాసనతో గదంతా నిర్మలంగా ఉంది. రౌండ్ రొటేటింగ్ బెడ్ గది మధ్యలో ఉంది. ఉల్లిపొరలాంటి దోమతెర బెడ్ మీదకు పైనుండి వ్రేలాడుతుంది. ఒక ప్రక్కన డ్రెస్సింగ్ టేబుల్, మరో ప్రక్కన సోఫాకమ్ బెడ్. ఒక ప్రక్కన గోడకు అడవిలో జలపాతం దృశ్యంతో వాల్‌పోస్టర్. మార్బుల్ ఫ్లోరింగ్ మామూలు కాళ్ళతో నడిస్తే మట్టి అంటుకుంటుందేమోనన్నట్లుగా ఉంది.

ఇంపోర్టెడ్ త్రీ... ఇన్ వన్, కంప్యూటరైజ్డ్ ఫోన్ ముఖమల్ బెడ్, ప్రతి చదరపు అంగుళంలో డబ్బు ప్రతిఫలిస్తోంది.

ఆ గది జయంతి కృష్ణగారి ఏకైక కుమార్తెది.

జయంతి కృష్ణగారు ఆ గదిలోకి వచ్చారు.

'గుమ్‌రాహ్' సినిమాలో "మై తేరా ఆషిక్ హు" అన్న పాట త్రీ ఇన్ వన్‌లో వస్తోంది. ఆ హీరో ప్రక్కన తనను ఊహించుకుంటూ, సోఫాలో కూర్చుని కలలు కంటోంది కృష్ణగారి ముద్దుల కూతురు అవంతి.

ఆమె పరిస్థితి, ఆనందం హుందాతనం చూసి తృప్తిగా గుండెల మీద చేయి వేసుకున్నారు జయంతిగారు.

జయంతి గారిని చూసి...

"పప్పా" అంటూ ఆయన మెడను చుట్టేసింది అవంతి.

"ఒరేయ్. నీకేం కావాలి రా చెప్పు. మీ డాడీ నీకోసం పై నుంచి మన్మధుణ్ణి తీసుకురమ్మన్నా తీసుకు వస్తాడు. వాట్ డూ యూ వాంట్ టెల్ మీ బేబీ."

ఆయన మెడ చుట్టూ చేతులు తీయకుండానే "పప్పా అయ్ వాంట్ రెడ్ మారుతివి.సి."

"ఓస్. ఇంకా ఏదో అడుగుతున్నావనుకున్నాను. రవ్వల నెక్లెస్ అంటావేమో డిలే అవుతుందనుకున్నాను."

"షిట్ నాకు నగలెందుకు డాడీ."

"వెల్ సెడ్ బేబీ. రేపు నీకోసం మారుతి ఎదురు చూస్తుంది కారిడార్‌లో."

"మై లవ్లీ పప్పా." ఆయన్ను కౌగలించుకుని ఒళ్ళంతా ముద్దులు కురిపించినంత పని చేసింది.

అక్కడ నుంచి...

తన జీవిత భాగస్వామి.

దివ్యగదిలోకి వెళ్ళాడు.

ఆ గదిలో డెకొరేటివ్ ఫ్లోరింగ్ మీద పెద్ద ఎగ్ షేప్‌లో ముఖమల్ బెడ్. బెడ్‌కి ఎదురుగా శృంగార భంగిమలో స్త్రీ బొమ్మ. ఒక ప్రక్కగా డ్రెస్సింగ్ టేబుల్, మరోప్రక్కన పెద్ద వార్డ్ రోబ్. ఒక గోడనిండా బృందావన్ గార్డెన్స్‌ని మరపించే పువ్వుల చెట్లు, పువ్వులు. గదినిండా ఖరీదైన పెర్‌ఫ్యూమ్ ఆవరించి ఉంది.

ఒళ్ళంతా స్ప్రే చేసుకుంటోంది.

తన పెళ్ళికి దివ్య అప్సరసలా ఉండేది.

పాలకోవా రంగులో ఎత్తుగా, ఎత్తుకు తగ్గలావుతో కుర్రకారు పడిచచ్చేలాగా" ది బివిచింగ్ బ్యూటీ దట్ కెన్ కిల్ ది మేన్ కైండ్" అన్నట్లుగా ఉండేది.

అప్పుడు తను షుగర్ ఫాక్టరీలో ఒక సాధారణ ఇంజినీరు.


తన అందం, అణకువ, పనిపట్ల దీక్ష, అన్నింటికన్నా ముఖ్యమైన బలహీనత మధ్యతరగతి బీదరికం చూసి... తన ఒక్కగా నొక్క కూతురికోసం తనను ట్రాప్ చేశాడు దివ్య తండ్రి.

అంతే...

టీ స్టాల్‌లోంచి ఫైవ్‌స్టార్ హోటల్‌లోకి అడుగుపెట్టాడు జయంతి.

మళ్ళా వెనక్కు తిరిగి చూడలేదు.

ఎన్నోకష్టాల కోర్చి ఇంజినీరింగ్ చదివించాము. ఏదో ఉద్ధరిస్తాడనుకున్న తల్లిదండ్రులు



కొన్నాళ్ళు ఎదురుచూసి వదిలేశారు.

ఆకాశంలో ఉన్న కొడుకుని తారలను చూసినట్టు చూసి, ఆ మెరుపు చూసి సంతోషించి సంతోషించి... పోయారు.

దివ్య ఎప్పుడూ తనని వదిలేదికాదు.

ఒక్క క్షణం దగ్గరలేక పోతే "అమ్మో నిన్ను వదిలి ఉండలేను" అనేది.

కొన్నిసార్లు తను బిజీగా ఉంటే లంచ్ తినిపించిన రోజులు ఉన్నాయి.

"డియర్ నన్ను వదిలి ఎప్పుడూ వెళ్ళవు కదా" అని ప్రామిస్ తీసుకున్న క్షణాలు ఉన్నాయి.

ఆ రోజులు...

మధుర స్మృతులు

ఆప్యాయతలు...

అనురాగాలు...

ఆదరణలు...

ఒకరినొకరు వదిలి ఉండలేని...

విరహ వేదన...

చల్లార్చుకునే మదనతాపాలు...

మళ్ళీవస్తాయా?

ఇప్పుడు

దివ్య

సంపద ఎలా ఐపూ అజా లేకుండా పెరిగి పోయిందో, దివ్య శరీరం కూడా అలాగే పెరిగి పోయింది.

చిన్న ఏనుగులా తయారైంది.

ఆమె ఎక్కితే 'మారుతి' మూల్గుతుంది.

ఆమె నగర మహిళా మండలి అధ్యక్షురాలు.

సారా నిషేధ సంఘ అధ్యక్షురాలు.

రైల్వేప్రయాణికుల సలహా సంప్రదింపుల సంఘ సభ్యురాలు.

వినియోగదారుల సంఘ సభ్యురాలు.

నగరంలో ఏ సభ జరిగినా ఆమెదే అగ్రస్థానం.

"డియర్" పలకరించారు జయంతి.

"ఓ మీరా... నేను పది నిముషాల్లో మహిళా మండలికి వెళ్ళాలి. ఈరోజు వందమంది బీద జంటలకు పెళ్ళిచేస్తున్నాము. ఖర్చంతా ఎక్కువ భాగం మనదే." గొప్పలు చెప్పుకు పోతుంది.

"వెల్‌డన్ దివ్యా. ఏదీ నిన్ను ఒక్కసారి ముట్టుకోనీ. నీ వయసు పెరిగినా నువ్వు పాలమీగడలా ఉన్నావోయ్." అన్నారు జయంతి తమకంతో.

"నాన్సెన్స్..." అంటూ ఆయన్ను దూరంగా తోసింది. కోటు జేబులోంచి చెక్‌బుక్ తీసి, ఖాళీ చెక్‌మీద సంతకం పెట్టి, దివ్య చేతిలో పెట్టి పర్సనల్ రూమ్‌లోకి వచ్చారు జయంతి.

భార్య!

పగలంతా చాకిరీ చేసి, భర్తకు కావాల్సిన వస్తువులు సమకూర్చి, రాత్రి అయితే ప్రక్కలో కోరిక కలిగితే వళ్ళు అప్పగించే స్త్రీ భార్య కాదు. భర్త పట్ల అనురాగం, ఆప్యాయత, ఆదరణ చూపగలిగేదీ, కష్ట సుఖాలలో పాలు పంచుకునేది భార్య.

భార్యను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని

## దగ్గరకు రానిస్తేనే ఆనందం

సినీరంగంలో తన సంగీతంతో కొత్త ఒరవడి సృష్టించిన ఇళయరాజాకి కొన్ని నియమాలున్నాయి. రికార్డింగ్ రూంలోకి ఆయన ఎవరినీ రానివ్వరు. తన పర్సనల్ మ్యూజిక్ సిట్టింగ్ రూంలోకి నిర్మాత, దర్శకుడిని తప్ప ఎవరినీ అనుమతించరు. కానీ సినిమారంగంలో ఒక 'ఛేంజ్' తెస్తున్న రెహమాన్, కీరవాణి, దేవాల 'ఫ్రీ' నెస్ చూసి, తానూ తన పద్ధతులను మార్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. దగ్గరకు రానిస్తేనే కదా ఎవరికైనా ఆనందం!

-రంజన

స్త్రీ స్పర్శ తగిలి ఎన్నాళ్ళైందో...

పార్టీల్లో డబ్బుకోసం...

అద్దె ప్రేమలు...

అద్దె అనురాగాలు...

అద్దె కౌగిళ్ళు...

ట్రాష్!

జీవితం యాంత్రికం అయిపోయింది.

జయంతి కృష్ణ తన గదిలోకి వచ్చారు. ఆ గదిలో తన కెంతో రిలాక్సింగ్‌గా ఉంటుంది.

వి.సి.పి ఆన్ చేశారు జయంతి.

సుబ్బరామిరెడ్డిగారి భగవద్గీత వస్తోంది.

కృష్ణుడు గీత బోధిస్తున్నాడు.

"చినిగిన వస్త్రమును విడిచి మనుజుడు నూతన వస్త్రమును ధరించినట్లే, శిధిలములగు శరీరములను విడిచి, కొత్త దేహములందాత్మ ప్రవేశించును."

జయంతి కృష్ణ గారు ఒక పెగ్ తాగి, పైపునోట్లో పెట్టుకుని గుండెలోకి పీల్చారు పొగ.

"అబ్బా' అనుకున్నారు.

గుండెలో ఏదో కలుక్కుమంది.

అంతే...


కొద్ది క్షణాల్లో...

కొడుకు జీవన్...

కూతురు అవంతి...

మహిళా మండలినుండి భార్య దివ్య వచ్చేశారు.

జయంతి గారికి టీ.వీ. చూస్తూ ప్రాణం పోవడంతో కళ్ళు తెరిచే ఉన్నాయి. ఆయన్ను చూస్తే భయం వేస్తోంది.



ఇంట్లో సర్వెంట్స్ అందరూ ఇంటి మెయిన్ హాల్లో ఐస్ బాక్స్‌లు పెట్టి, ఆయన భౌతికకాయాన్ని వాటి మీద పడుకోబెట్టారు.

ఆయన కళ్ళు ఇంకా తెరిచే ఉన్నాయి.

పురోహితులు వచ్చారు.

"అమ్మా. మీ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా వారి కళ్ళు మూసి, తలవద్ద దీపం ఉంచండి. అలా చేస్తే మీ కుటుంబానికి చాలా మంచిది.

"అమ్మో నాకు డెడ్‌బాడీ అంటే చాలా భయం. ఒక సారి మహిళా మండలిలో డెడ్ బాడీ చూస్తే 'మైల్డ్ హార్ట్ ఎటాక్' వచ్చింది. నాకేదైనా అయితే ఈ కుటుంబాన్ని ఎవరు చూస్తారు?" అంది దివ్య ఆయన భార్య.

నిజమే మరి!

"అమ్మో నాకు శవం అంటే భయం. ఆ పనేదో మీరే చెయ్యండి. పంతులుగారూ."అన్నాడు ముద్దుల కొడుకు జీవన్.

"పప్పా అంటే నాకు ప్రాణం. కాని శవం అంటే అమ్మో..." అంది అవంతి.

జీవితంలో సకల సౌకర్యాలూ...

సరదాగా తిరగడానికి కొడుక్కి ఐదులక్షలు ఖరీదు చేసే కారూ...

లైఫ్ ఎంజాయ్ చేయడానికి కూతురికి రెండున్నర లక్షల మారుతీ ఎ.సి. కారూ...

సొసైటీలో బిగ్ లేడీగా చలామణీ అవడానికి దివ్య డియర్ భార్యకు బ్యాంక్ చెక్స్ ఇచ్చిన కోటీశ్వరుడు.

దానశీలి.

జయంతి కృష్ణ గారి తెరుచుకున్న కళ్ళు మూయడానికి, తలవద్ద దీపం పెట్టడానికి ఆయన కుటుంబ సభ్యులకు భయంగా ఉంది.

అదే...

ఆయన కొన ఊపిరితో ఉన్నా,

ఆయన చేత సంతకాలు పెట్టించుకో డానికి...

మిగిలిన కోరికలు ఎలా తీర్చుకోవాలని అరా తీయడానికి...

బ్యాంకుల్లో ఎంత డబ్బు ఉందో కనుక్కో డానికి.

చుట్టూ చేరేవారే...

కానీ...

ప్రస్తుతం..

ఆయన

జీవంలేని కట్టె.

ఆ కట్టె ఎవరికీ పనికిరాదు.

సాధ్యమైనంత త్వరగా పారెయ్యాల్సిందే.

ఆయన ఆలస్యంగా ఇంటికి వస్తే గేటు దగ్గరే కాపలా ఉండే ఒక భారీ మనిషిలా ఉండే అల్సేషన్ డాగ్" కుయ్ కుయ్" అని అరుస్తూ ఆయన భౌతిక కాయం చుట్టూ తిరుగుతుంది. దానికళ్ళు దీనంగా ఉన్నాయి. ఆయనను చూడటానికి వచ్చిన వాళ్ళందర్నీ జాలిగా చూస్తోంది. మామూలు సందర్భాలలో అయితే అపరిచితులు వస్తే మీదపడి చంపేసేంత పనిచేసే ఫెరోషియస్ డాగ్ అది.

"కాతే కాన్తా కస్తే పుత్రః
సం సారోయమ తీవ విచిత్రః
కస్యత్వం కః కుత ఆయాతః
తత్వం చిన్తయ తదిహ భ్రాతః"

"ఎవరు నీభార్య? నీ పుత్రుడెవరు? ఈ సంసారం మిక్కిలి చిత్రమైంది. నువ్వెవరి వాడవు? ఎక్కణ్ణుండి వచ్చావు తమ్ముడూ. ఆ విషయాన్ని గురించి ఇప్పుడాలోచించు."

ఎవరూ ఆహ్వానించకుండానే, తనకు తానై వచ్చి, ఆ కుటుంబానికి సంబంధించిన సిద్ధాంతి గారు పురాణ ప్రవచనం చేస్తున్నారు. జయంతికృష్ణ గారి భౌతిక కాయం ప్రక్కన చిరు చాప వేసుకుని... జయంతిగారి ఆదరాభిమానాలతో ఆ సిద్ధాంతిగారి కుటుంబం గడుస్తోంది. సిద్ధాంతిగారి కళ్ళు చెమరుస్తున్నాయని ఆయన ముఖం చెప్పకనే చెప్తుంది.



## భోజనం

భోజనాల దగ్గర పిల్లల గోల
భరించలేక...

తల్లిః నోరు మూసుకొని తింటారా లేదా?

పిల్లలుః నువ్వు చేతులు కట్టుకొని వడ్డిస్తే మేము నోరు మూసుకొని తింటాం మమ్మీ!

- పి.వి.భైరవన్
(రాజంపేట్)

జయంతి కృష్ణగారి భౌతిక కాయం దగ్గరకు నెమ్మదిగా వెళ్ళి ఆయన కళ్ళుమూసి తన రెండు అరచేతులు ఆయన ముఖానికి అడ్డుకుని, తన ముఖానికి ఆ చేతులు అద్దుకుని ముద్దుపెట్టుకుని, కంటినిండానీరుతో ఆయన తలవేపు ప్రమిదలో దీపంపెట్టాడు ఆ ఇంటి నౌకరు. ఆయనను ముట్టుకునే భాగ్యం కలిగినందుకు వాడిముఖంలో ఒక ప్రక్క ఆనందం, గర్వం తొంగిచూస్తున్నాయి.

జయంతి కృష్ణ... నువ్వెవరి వాడవు.

ఎక్కడనుండి వచ్చేవు తమ్ముడు.

ఇప్పుడు ఆలోచిస్తున్నావా?

చాలా ఆలస్యమైపోలేదూ..

* * *

